క్లుప్తంగా

కుట్టు శిక్షణతో ఆర్థిక భరోసా



మంగళగిరి: కుట్టు శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియా తెలిపారు. నీరుకొండలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో కురగల్లు గ్రామానికి చెందిన 30 మంది మహిళలకు కుట్టు శిక్షణ పూర్తవ్వగా శుక్రవారం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నిర్వాహకులు రమేష్ కన్నన్, వేణుగోపాల్, టీచర్లు ధనకుమారి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను వర్గీకరించాలి



తాడేపల్లి రూరల్: స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను వర్గీకరణ చేయాలని జాతీయ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపకుడు బీసీ రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో బీసీ మేధావులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఏపీలో త్వరలో జరిగే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 50 శాతం పెంచి ఏ,బీ,సీ,డీ,ఈ వర్గీకరణ చేసి బీసీల అందరికీ సమన్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. వర్గీకరణ లేకపోవడంతో జరిగే నష్టాన్ని అన్నిపార్టీల నాయకుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగ నాయకులు హనుమంతరావు, గోదావరి జిల్లా నుండి మహేంద్ర, సత్యనారాయణ, మహిళా నాయకురాలు భీమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



తాడేపల్లి రూరల్: గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని తాడేపల్లిలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ దళితులపై దశాబ్దాలుగా కొనసాగుతున్న కులవివక్షను కవిత్వం ద్వారా బహిర్గతం చేసిన మహాకవి గుర్రం జాషువా అని అన్నారు. ఇటీవల హైకోర్టు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి చేసిన కొన్ని వ్యాఖ్యలు సమాజంలో విస్తృత ఆందోళనకు దారితీశాయని, ఈ వ్యాఖ్యలు రాజ్యాంగంలో కల్పించిన సమానత్వ హక్కు (ఆర్టికల్ 14), హింస నుంచి రక్షణ (ఆర్టికల్ 17), సామాజిక న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని భావిస్తున్నామన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్, కోటా బాబూరావు, దర్శనపు విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ల చించివేతపై ఫిర్యాదు



మంగళగిరి టౌన్: బ్యానర్ల చించివేతపై శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సేకరించిన వివరాల ప్రకారం దసరా నవరాత్రుల సందర్భంగా నగర పరిధిలోని పార్కురోడ్డు వద్ద అమ్మవారి చిత్రాలతో కూడిన మూడు బ్యానర్లను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. వీటిలో రెండు బ్యానర్లను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారని నిర్వాహకులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. పట్టణ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీను పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు.

గణపతికి వెండి ఆభరణాలు

తెనాలి: స్థానిక చినరావూరులోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామికి గురువారం భక్తులు, గ్రామస్తులు పలు వెండి ఆభరణాలను సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరిప్రసాద్‌కు ఆభరణాలను అందజేయగా, అర్చకులు గూడూరు ఈశ్వర భరద్వాజ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వాటిని స్వామివారికి అలంకరించారు. ఆలయ ఈవో హరిప్రసాద్ మాట్లాడుతూ ఆలయంలోని విఘ్నేశ్వరస్వామికి గ్రామస్తులు 629 గ్రాములతో వెండి తొండము, నామాలను అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు గొల్లమూడి అప్పారావు, గొల్లమూడి వెంకటేశ్వరరావు, సూర్యదేవర శివలింగప్రసాద్, వాసిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మరూపం... దివ్యతేజం

నేత్రపర్వం.. దసరా ఉత్సవాలు

మంగళగిరి టౌన్/మంగళగిరి: దసరా ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. అమ్మవారికి అభిషేకాలు పూజలు నిర్వహించి, రంగురంగుల పూలు, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించారు. అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు తిలకించి మైమరచిపోయారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో..

మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారు శ్రీఆదిలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ సునీల్‌కుమార్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివాలయంలో..

గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ గోపి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో

పాత మంగళగిరి దుర్గ నగర్ బైపాస్ వెంట ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు ఇంటూరి దుర్గాప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాళీమాత ఆలయంలో..



కాళీమాత ఆలయంలో కుంకుమపూజలో మహిళలు

గౌతమ బుద్ధ రోడ్ రాజీవ్ గృహకల్ప రోడ్డు వెంట ఉన్న శ్రీ కాళీమాత ఆలయంలో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు.

మేడికొండూరు: డోకిపర్రు పోలేరమ్మ ఆలయ ధర్మకర్త మేడికొండూరు జెడ్పీటీసీ కందుల సిద్దయ్య ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు డి.శ్రీనివాస్ సిద్ధాంతి ఏక రుద్రాభిషేకం కాలభైరవ హోమం, చండీ పారాయణం, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని శ్రీ గంగా బాలత్రిపుర సుందరీదేవి శ్రీ రాజరాజేశ్వరి సమేత త్రిపుర తాండేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో, ఉండవల్లి రెడ్ల రామమందిరంలో అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

చినకాకాని(మంగళగిరి): చినకాకాని చెరువు కట్ట వద్ద ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని కరెన్సీ నోట్లు, గాజులతో అలంకరించారు.

తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై నిర్వహిస్తున్న దసరా వేడుకల్లో భాగంగా శుక్రవారం సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుగ్గిరాల: కంఠంరాజుకొండూరులోని మహంకాళి ఆలయంలో శుక్రవారం అమ్మవారు గౌరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఏర్పాట్లను ఈఓ సునీల్‌కుమార్ పర్యవేక్షించారు.



రెడ్ల రామమందిరంలో మహాలక్ష్మి అలంకారంలో



మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు



నరసింహస్వామి ఆలయంలో..



కనకదుర్గ ఆలయంలో శ్రీ లలిత త్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు



పల్లకీ సేవలో సంతానలక్ష్మి అమ్మవారు



మహంకాళి ఆలయంలో

ఓ తాగుబోతులా మాట్లాడాడు !

మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వేమారెడ్డి



మంగళగిరి: అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యలు వీధిన తిరిగే ఓ తాగుబోతు మాటల్లా ఉన్నాయని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మండిపడ్డారు. నగర పరిధిలోని ఆత్మకూరు పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో బాలకృష్ణ మాటలు చూస్తుంటే అతని మానసిక పరిస్థితి ఎంత దిగజారిందో అర్థమవుతుందని, వెంటనే ప్రభుత్వం మెంటల్ ఆసుపత్రికలో చేర్పి చికిత్స చేయించాలని హితవు పలికారు. తన ఇంటిలో సినీ నిర్మాతపై కాల్పులు జరిపినప్పుడు కేసు నుంచి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దయతో బయటపడిన సంగతి బాలకృష్ణ గుర్తుంచుకోవాలని తెలిపారు. కేసుల నుంచి తప్పించుకోవడానికి మెంటల్ సర్టిఫికెట్లు తెచ్చుకున్న బాలకృష్ణ వ్యాఖ్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఖండించకపోవడం వారి కుసంస్కారానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. బాలకృష్ణ వ్యాఖ్యలపై చిరంజీవి స్పందించిన విషయం ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి సినిమా టికెట్ల ధరలు తమ సమావేశం కారణంగానే పెంచారని చిరంజీవి చెప్పిన విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. ఎన్టీఆర్ ఎంతో కష్టపడి పైకి వచ్చారు కాబట్టి ఆయనకు విలువలు ఉన్నాయని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఆయనకు వెన్నుపోటు పొడచి పైకిరాగా, వారిని అడ్డుపెట్టుకుని పైకి వచ్చావని మరచిపోకూడదని బాలయ్యకు హితవు పలికారు. ఇప్పటికైనా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని, లేనిపక్షంలో తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగ కార్యదర్శి ఎండీ. ఫిరోజ్, జిల్లా యాక్టివిటీ సభ్యురాలు మల్లవరపు సుధారాణి, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు నంబె సునీత, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు రమేష్, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు దర్శి రమేష్, సోషల్ మీడియా అధ్యక్షుడు శరణ్‌కుమార్‌రెడ్డి, పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రదీప్ పాల్గొన్నారు.

రాజధాని రైతుల నుంచి అర్జీల స్వీకరణ

తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. పలువురు రాజధాని ప్రాంత వాసులు, రైతుకూలీలు తమ అర్జీలను గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్(జీఆర్ఎం) నోడల్ అధికారి పి.జయశ్రీకి అందజేశారు. సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్ డేకు హాజరై అర్జీదారులు అందజేసిన ఫిర్యాదుల్లో కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. గ్రీమొత్తం 28 ఫిర్యాదులు రాగా అందులో అమరావతిలో భూమి వ్యవహారాలు 23, సామాజిక సంక్షేమం(ఇంజినీరింగ్) 3, కాంట్రాక్టర్ గ్రీవెన్సులు 1, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ 1 ఉన్నాయి. గ్రీవెన్స్ డేలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం. శేషిరెడ్డి, పి.పద్మావతి, బి. శ్రీనివాస నాయక్, జి. భీమారావు, కె.ఎస్.భాగ్యరేఖ, ఎం.శేషిరెడ్డి, డెవలప్మెంట్ ప్రమోషన్ విభాగ జోనల్ జాయింట్ డైరెక్టర్ సి.హెచ్. మధుసూదనరావు, సిఆర్డిఏ సామాజిక సంక్షేమ విభాగ డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నోడల్ అధికారి జయశ్రీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ ఆదంబీ అన్నారు. మండలంలోని బేతపూడి జెడ్పీ పాఠశాలలో స్వస్థ్‌నారీ-సశక్త్‌పరివార్ అభియాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ ఆదంబీ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆరోగ్యకార్యకర్తలు తెలియజేయాలని చెప్పారు. అనంతరం కిశోరబాలికలు, గర్భిణులు, బాలింతలకు నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యురాలు యానీగ్రేస్ పరీక్షలుచేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, సుదర్శన్‌రాజు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో

ఫిరంగిపురం పీహెచ్‌సీ పరిధిలోని గొల్లపాలెంలోని బీసీ కాలనీలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పంచాయతీ సిబ్బంది సహకారంతో యాంటీ లార్వా ఆపరేషన్స్ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎస్ అబ్దుల్ రెహమాన్, ఎంఎల్‌హెచ్‌పి కిరణ్, ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

శిరంగిపాలెంలో

గ్రామంలో ఇంటింట దోమల లార్వా, జ్వరాల సర్వేను ఆరోగ్యసిబ్బంది నిర్వహించారు. గ్రామంలోని మురుగుకాలువల్లో పేరుకున్న వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో కార్యదర్శి భాగ్యరాజు, హెచ్ఎస్ జె.బాబురావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గిరాల: చిలువూరు షాదీఖానాలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ షేక్ జబీన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

● షాదీ-ఖానాలో జరిగిన పోషణ మాసోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.భవాని, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



శిరంగిపాలెంలో మురుగు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

పలు గ్రామాల్లో పొలంబడి

ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు, శిరంగిపాలెం గ్రామాల్లో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు మోహన్‌రావు మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడుకోవాలని చెప్పారు. రైతులకు భూసార పరీక్ష పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏవో వాసంతి, విస్తరణాధికారి షేక్.సుబాని, సిబ్బంది పాల్గొన్నారు.

చిలువూరులో పొలంబడి

దుగ్గిరాల: గాలి తేమ అధికంగా ఉంటే వరిలో అగ్గితెగులు రావచ్చని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ ఆర్.విజయబాబు తెలిపారు. శుక్రవారం దుగ్గిరాల మండలం చిలువూరులో పొలంబడి జరిగింది. ప్రజ్ఞాన్‌బాబు, బాలచంద్ర శేఖర్ పాల్గొన్నారు.



పొలంబడిలో రైతులతో ఏఓ

జంక్ ఫుడ్‌తో అనారోగ్య సమస్యలు

నూతక్కి(మంగళగిరి): జంక్ ఫుడ్‌తో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని కేఎల్‌యూ విద్యార్థులు తెలిపారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నూతక్కి, తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలో కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు శుక్రవారం జంక్ ఫుడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ ఎక్స్టెన్షన్ యాక్టివిటీస్(సీఈఏ)ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ జంక్‌ఫుడ్ వినియోగంతో ఊబకాయం, మధుమేహం, గుండెజబ్బులు, ఫ్యాటీ లివర్ వంటి శారీరక సమస్యలతో పాటు ఏకాగ్రత లోపం, జ్ఞాపకశక్తి తగ్గుతాయన్నారు. జంక్‌ఫుడ్‌లో కొవ్వు పదార్థం, చక్కెర, ఖాళీ క్యాలరీలు ఆరోగ్యానికి ముప్పుగా మారుతాయన్నారు. ఇవి మానవ శరీరంలోని మెటబాలిక్ వ్యవస్థను దెబ్బతీసి ఇన్సులిన్ రెసిస్టెన్స్, పోషకాహారలోపం, కిడ్నీ వ్యాధులు, కండరాల వాపు వంటి సమస్యలకు దారితీస్తాయని తెలిపారు.

విధులకు సకాలంలో హాజరు కావాలి

తెనాలి అర్బన్: విధులకు సకాలంలో హాజరు కావాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా ఏసుబాబు సూచించారు. 4వ శానిటేషన్ డివిజన్ కార్యాలయాన్ని శుక్రవారం తెల్లవారుజామున ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నెలరోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరూ బాధ్యతతో పనిచేసి పారిశుద్ధ్య మెరుగుదలకు కృషి చేయాలన్నారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పనులను పరిశీలించారు. పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

తెనాలి టౌన్: స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో శనివారం జరిగే జాబ్‌మేళాను నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అత్తోట దీప్తి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ ఉదయం 10- సాయంత్రం 4 గంటల వరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు. 20 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు ప్రారంభ జీతంగా ఇస్తారని చెప్పారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

తెనాలి అర్బన్: ప్రాథమిక వైద్య చికిత్సపై అందరూ అవగాహన కలిగి ఉండాలని రమేష్ హాస్పటల్ కార్డియాలజీ వైద్యుడు డాక్టర్ వివేక్ వీరాంరెడ్డి పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. గుండెనొప్పి సమయంలో చేసే సీపీఆర్ గురించి తెలిపారు. అనంతరం ఆయనను నిర్వాహకులు సన్మానించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ టి.జ్యోతిబసు, కె.కళ్యాణ్ చక్రవర్తి, పి.భార్గవిలు తదితరులు పాల్గొన్నారు.

వరదల వేళ అప్రమత్తంగా ఉండాలి

కొల్లిపర: ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షాలు కురుస్తున్న కారణంగా రానున్న రెండు రోజుల్లో కృష్ణా నదికి వరద పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. మండలంలోని బొమ్మువానిపాలెం, అన్నవరపులంక గ్రామాల్లో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహతో కలసి కలెక్టర్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని రైతులతో మాట్లాడారు. వారి సమస్యలపై ఆరా తీశారు. నదిలో వరద నీరు ఎంత మేరకు వస్తే ప్రమాదం, ఎన్ని లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తే పంటలకు, గ్రామానికి నష్టం జరుగుతుందన్న అంశాలను అధికారులను, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నది పరీవాహక ప్రాంతాల్లో రైతులు ఏ పంటలు పండిస్తున్నారని ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... కృష్ణా నదికి వరద పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ముందస్తుగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మండల అధికారులు ముందుగా ప్రజలకు సమాచారం అందించినప్పుడు ప్రజలు పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంటు వ్యాధులపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

మంగళగిరి పరిధిలో వాటర్ ప్లాంట్ల తనిఖీ

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలో వాటర్ ప్లాంట్లను మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ శకుంతల శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎన్‌సీసీ రోడ్, కొప్పురావు కాలనీ, శ్రీ లక్ష్మీ నరసింహ కాలనీలతో పాటు పలుప్రాంతాల్లో వాటర్‌ప్లాంట్ నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. తమ ప్లాంట్లలో సరఫరా చేస్తున్న తాగునీరు నమూనాలను గుంటూరు రీజనల్ లేబొరేటరీ నుంచి ధ్రువీకరించిన పరీక్ష నివేదికలను 48 గంటల్లోగా నగరపాలక సంస్థ కార్యాలయంలో సమర్పించాలని నిర్వాహకులకు ఆదేశించారు. వాటర్‌ప్లాంట్ లోపల, బయట పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. అనంతరం నగర పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ ప్రసన్నజ్యోతి, సచివాలయ వార్డు శానిటేషన్, ఇంజినీరింగ్, హెల్త్ కార్యదర్శులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు నోటీసులు అందజేస్తున్న అధికారులు

ఓజోన్ పొర రక్షణపై అవగాహన

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఈసీఈ విభాగం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన శుక్రవారం ప్రాతూరు గ్రామంలో ప్రజలకు ఓజోన్ పొర రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్యార్థి విభాగం అధికారి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కాలుష్యం కారణంగా ఓజోన్‌పొర నాణ్యత తగ్గడంతో ఆరోగ్యానికి, పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి ప్రతికూలంగా మారి సమస్త జీవరాశుల మనుగడే ప్రమాదంలో ఉందన్నారు. ప్రతికృతి వైపరీత్యాలతో అతివృష్టి, అనావృష్టి కారణంగా జీవన విధానం తీవ్రమైన ఒడిదొడుకులకు గురవుతోందని గ్రామస్తులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి, ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి. సురేష్, వలంటీర్లను, వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డీన్ స్టూడెంట్ అఫైర్స్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఐ.గోవర్ధని తదితరులు అభినందించారు.



ఓజోన్ పొర గురించి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

బాలకృష్ణ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

పట్నంబజారు: చేతిలో పెగ్గు.. నెత్తిన విగ్గు పెట్టుకుని మెంటల్ సర్టిఫికెట్ ఉన్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నిజమైన పిచ్చోడినని అసెంబ్లీ సాక్షిగా నిరూపించుకున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి విమర్శించారు. గుంటూరు అరండల్‌పేటలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తన బ్రాండ్ అయిన మ్యాన్షన్ హౌస్‌ను కడుపునిండా తాగి బాలకృష్ణ అసెంబ్లీకి వచ్చాడన్నట్లు ఉందని, అందుకే ఏ మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఆయన పిచ్చోడు కాబట్టే ఇంట్లో కాల్పులు జరిపారని, ఎదురుపడిన వాడినల్లా కొడుతుంటాడని విమర్శించారు. సభ్యత, సంస్కారం లేకుండా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కారుకూతలు కూస్తూ పైశాచిక ఆనందాన్ని కూటమి నేతలు పొందుతున్నారని మండిపడ్డారు. సభలో కనీసం ఆ వ్యక్తి లేనప్పుడు ఆయన గురించి మాట్లాడకూదన్న ఇంగిత జ్ఞానం లేని వ్యక్తులు అసెంబ్లీలో ఉన్నారని మస్తాన్‌వలి దుయ్యబట్టారు. బేషరతుగా బాలకృష్ణ జగనన్నకు క్షమాపణలు చెప్పాలని, లేదంటే వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు.



మస్తాన్‌వలి